తాత్సారం!

- ఈ క్రాప్.. రైతుకు తంటా
- పూర్తికాని పంట నమోదు
- మండలంలో 23,500 ఎకరాల్లో సాగు
- ఇప్పటివరకు 51శాతం నమోదు
- నెలాఖరులోపు చేయించుకుంటేనే పరిహారం, బీమా వర్తింపు
- అన్నదాతలో ఆందోళన

అచ్చంపేట: గడువు సమీపిస్తున్నా పంట నమోదు పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఇప్పటి వరకు మండలంలో 51 శాతం మాత్రమే ఈ క్రాప్ నమోదైంది. పంట నమోదు ఆలస్యమవుతుండటంతో రైతుల్లో ఆందోళన అధికమవుతోంది. సాగుచేసిన ఏ పంటైనా వర్షా భావ పరిస్థితులు, విపరీతమైన తెగుళ్ల కారణంగాగానీ, ప్రకృతి వైపరీత్యాలతోగానీ దెబ్బ తింటే రైతులకు పరిహారం లేదా బీమా సాయం అందించేందుకు వీలుగా ప్రభుత్వం ఈ పంట నమోదు చేపట్టింది. రైతు పేరు, ఏ పంట, ఎంత విస్తీర్ణంలో సాగుచేశారు, భూమి సర్వే నెంబరు, తదితర అంశాలను ఈ పంట నమోదులో పొందుపరుస్తారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా మండలంలో పత్తి, మొక్కజొన్న, వరి, మిర్చి పంటలు వేశారు. వేసిన పంటలన్నింటినీ కచ్చితంగా వ్యవసాయ సిబ్బంది పొలం వద్దకు వెళ్లి వేసిన పంటలవద్ద రైతు ఫొటో తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అప్పుడే ఈ క్రాప్ నమోదు పూర్తయినట్లు. అయితే ఇది సరిగా జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

అలా చేస్తేనే బీమా క్లెయిమ్‌కు అవకాశం

అచ్చంపేట మండలంలో ఏటా 23500 ఎకరాల విస్తీర్ణంలో రైతులు పంట సాగుచేస్తారు. ఇప్పటి వరకు పత్తి, మొక్కజొన్న, మిర్చి పంటలు సుమారుగా 18,750 ఎకరాల విస్తీర్ణంలో వేశారు. మిగిలిన భూముల్లో రైతులు అక్టోబరు వరకు మిర్చి పంటలు వేయనున్నారు. వ్యవసాయ సిబ్బంది ఈ క్రాప్ నమోదులు తప్పనిసరిగా చేయాలి. అలా చేసిన భూములకు మాత్రమే బీమా క్లెయిమ్ చేసేందుకు అవకాశాలుంటాయి.

ముగియనున్న గడువు

ఈ క్రాప్ నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం ఈ నెలాఖరు అంటే సెప్టెంబరు 30లోపు నమోదు చేసుకోవలసి ఉంది. ఇప్పటివరకు 18,750 ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేస్తే కేవలం 9,500 ఎకరాల్లో మాత్రమే అంటే 51శాతం ఈ క్రాప్ నమోదు చేసినట్లు వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు. మరో 10 రోజుల్లో మిగిలిన 49 శాతం పంట నమోదు పూర్తి చేయడం కష్టంతో కూడుకున్న పని. ఈ ఏడు అసలే అతివృష్టి, అనావృష్టితో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే పల్లపు భూములలో వేసిన పత్తి పంటలు అధిక వర్షాలకు ఉరకేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. కిందటి సంవత్సరం ఇదే పరిస్థితులలో పత్తి దిగుబడులు లేక, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి పరిస్థితుల్లో సకాలంలో ఈ క్రాప్‌లు నమోదు చేయడంలో అలసత్వం వహిస్తే జరగరాని విపత్తు సంభవిస్తే ఆదుకునేదెవరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రుద్రవరంలో ఈ క్రాప్ నమోదు చేయాల్సిన పత్తి పంట



8 ఎకరాలకు రెండెకరాలే నమోదు చేశారు

నాలుగురన్నర ఎకరాల సొంతభూమి, మరో మూడున్నర ఎకరాల్లో మానాన్న భూమి, మొత్తం 8 ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేశాను. 2 ఎకరాల్లో పత్తి, 3 ఎకరాల్లో మిర్చి, 2 ఎకరాల్లో సుబాబులు, అర ఎకరంలో మాగాణి, మరో అర ఎకరంలో గొడ్లకు వేత వేశా. 8ఎకరాల్లో పంటలు వేస్తే కేవలం రెండు ఎకరాలకు మాత్రమే ఈ క్రాప్ నమోదు చేశారు. మిగతాది చేయమంటే పట్టించుకోవడం లేదు. అనుకోకుండా నష్టం జరిగితే ఆదుకునేదెవరు.

– అనుముల సాంబిరెడ్డి, రైతు, రుద్రవరం



అక్టోబరు 15వరకు నమోదు చేస్తాం

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రతి ఎకరా భూమిని ఈ క్రాప్ చేస్తాం. ఇప్పటి వరకు 51శాతం పంటలు నమోదు చేశారు. రైతులు పూర్తి విస్తీర్ణంలో పంటలు వేయలేదు. 23500 ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేయాల్సి ఉంటే ఇప్పటివరకు 18750 ఎకరాల్లోనే వేశారు. ఇంకా సుమారు 7వేల ఎకరాలలో పంటలు వేయాల్సి ఉంది. మిర్చి అక్టోబరు 15వరకు వేస్తూనే ఉంటారు. తమ సిబ్బంది ప్రతి ఎకరా పంట భూమిని ఈ క్రాప్ చేస్తారు. అక్టోబర్ 15 వరకు ఈ క్రాప్ చేస్తాం. ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

– పి.వెంకటేశ్వర్లు, ఏవో, అచ్చంపేట

యూరియా సమస్య పరిష్కరిస్తాం

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డు పరిధిలోని పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల రైతులకు ప్రస్తుతం నెల కొని ఉన్న యూరియా సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మార్కెట్‌యార్డు చైర్మన్ షేక్ జరీనా అన్నారు. శుక్రవారం మార్కెట్‌యార్డు సమావేశం హాల్లో నూతన పాలకవర్గం సర్వసభ్య సమావేశం యార్డు కార్యదర్శి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. చైర్మన్ మాట్లాడుతూ ఐదు మండలాల రైతులు సంతృప్తి పడేలా యూరియా అందించేందుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. వేబ్రిడ్జి మరమ్మతు, ప్రహరీ, డొంకరోడ్లు వేయటం తదితర అంశాలపై చర్చించి తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఏటీఎంవో కేవీస్ ఉపేంద్రకుమార్, ఏడీఏ మస్తానమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపికలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్స్ పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 21న సత్తెనపల్లిలోని విద్యా కేంద్రం డిగ్రీ కళాశాలలో జరుగుతాయని పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వడ్డెంపూడి పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డును తీసుకొని రావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27, 28 తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల, మహిళల చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఇతర వివరాలకు 8712129398, 9985186556 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. ఆయనతో పాటు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల శివరామకృష్ణ ఉన్నారు.

క్లుప్తంగా

'పరివర్తన'లో విద్యార్థులకు అన్నదానం



పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే నంబూరుశంకరరావు జన్మదినం పురస్కరించుకుని గురువారం రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్తెనపల్లిలోని పరివర్తన పాఠశాల (డెఫ్ అండ్ డమ్) విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విప్పల రాజశేఖరరెడ్డి, షేక్ నాగుల్ షరీఫ్, గొర్రెపాటి బ్రహ్మయ్య, మహేష్‌బాబు, నందిగం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గోమాతలో.. సమస్త విశ్వాన్ని కాపాడేశక్తి

దక్షిణ భారత గోరక్ష ప్రముఖుడు యాదగిరిరావు

అచ్చంపేట: సమస్త విశ్వాన్ని, మానవాళి ఆరోగ్యాని, ప్రకృతిని, భూమిని, పర్యావరణాన్ని కాపాడే శక్తి ఒక్క గోమాతకే ఉంటుందని దక్షిణ భారత గోరక్ష ప్రముఖుడు యాదగిరిరావు అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన గో రక్షా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గోవులను, గో సంతతిని కాపాడుకోవడం అందరి కర్తవ్యమన్నారు. ప్రతి గ్రామంలో గో రక్ష సమితులను ఏర్పాటుచేసి గో ఆధారిత వ్యవసాయం, గో ఉత్పత్తుల తయారీ, పంచగవ్య చికిత్సలు మొదలైన వాటిలో శిక్షణా తరగతులను నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో గోరక్ష ఉత్తరాంధ్ర ప్రముఖులు సుబ్బారాయుడు, జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్, జిల్లా ప్రముఖ్ తుమ్మా మల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ అయ్యపరాజు, ఆవుల సంఘ ట్రస్ట్ చైర్మన్ మన్నవ చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు భావితరాల నిర్మాతలు



పెదకూరపాడు: అధ్యాపకులు భావితరాల నిర్మాతలు అని దేశ ప్రగతిలో వారి పాత్ర కీలకమని కాకతీయ విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ దీవి లలిత బాబు చెప్పారు. పాఠశాలలో హిందీ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ బాజీకి ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఈ సంవత్సరానికి పాన్ ఇండియా ఐకానిక్ అధ్యాపక పురస్కారం రావడం చాలా సంతోషకరమని చెప్పారు. శీలంనేని ఇందిరాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు కబడ్డీ కిట్


అచ్చంపేట: ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు స్నేహహస్తాలు ఫౌండేషన్ శుక్రవారం రూ.25వేలు విలువచేసే కబడ్డీ కిట్‌ను ఎంఈవో ఏకుల ప్రసాదరావు చేతులమీదుగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరీముల్లా బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు మోపర్తి ప్రకాశరావు, సత్యానాయక్, సందెపోగు మహేష్ తదితరులున్నారు.

దంచికొట్టింది



సత్తెనపల్లి: నియోజకవర్గంలో ఉరుములు, మెరుపులతో వర్షం శుక్రవారం సాయంత్రం దంచి కొట్టింది. సాయంత్రం 6 గంటల సమయంలో ప్రారంభమైన వర్షం 2 గంటల పాటు కురవడంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. ఇది ఇలా ఉంటే సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో సత్తెనపల్లి–అమరావతి ప్రధాన రహదారిలోని చప్టాపై నీరు ప్రవహించింది. రాకపోకలకు వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పరిశుభ్రత పాటించాలి



సత్తెనపల్లి: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ నంబూరి ఆనంద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో స్వచ్ఛతా హీ సేవ–2025 లో భాగంగా స్వచ్ఛ ఉత్సవ్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆనంద కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని గ్రహించాలన్నారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, శానిటేషన్ కార్మికులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యురాలు గఫ్రూన్

ఊటుకూరు(క్రోసూరు:) కుటుంబంలో మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు గఫ్రూన్ అన్నారు. ఊటుకూరులో శుక్రవారం నిర్వహించిన స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ జరిగింది. సర్పంచ్ జెర్రిపోతు బుచ్చయ్య, టీడీపీ నాయకురాలు వేగుంటరాణి, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, వాసిరెడ్డి మల్లేశ్వరరావు, వీఆర్వో పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు: కుటుంబంలో తల్లి ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యంతో విరాజిల్లుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.సురేష్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, పీహెచ్‌సీ వైద్యులు మణికంఠ, వెంకటేశ్వర్లు, హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ రమీజున్ తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని అనుపాలెంలో మహిళలకు వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రవితేజనాయక్, ప్రభుత్వ ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్ శ్రీనివాస్‌లు సుమారు 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాంచన, సీహెచ్‌వో శిరీషా, యోగా టీచర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి: ధరణికోట గ్రామంలో శుక్రవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్‌లో భాగంగా అత్తలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్న కుమార్, సీహెచ్‌వో స్వర్ణలత ఎంపీహెచ్ ఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా సైదులు



మాట్లాడుతున్న అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జెట్టి సైదులు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ నూతన గౌరవాధ్యక్షుడిగా జెట్టి సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్న బొడ్డు రామారావు ఇటీవల మరణించడంతో ఎన్నిక జరిగింది. పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా జక్కుల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పెన్షనర్స్ కార్యాలయ ఏర్పాటు విషయంలో సైదులు సహాయపడ్డారన్నారు. జెట్టి సైదులు మాట్లాడుతూ పెన్షనర్స్‌కు పూర్తిస్థాయి సహకారాన్ని అందించగలనన్నారు. ప్రధాన కార్యదర్శి కేబీఆర్‌జే ప్రసాద్ మాట్లాడుతూ నూతన బృంద సభ్యులతో కలిసి పని చేయాలని, మంచి సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఇన్‌కంట్యాక్స్ ఈ–ఫైలింగ్ చేయడానికి సాయపడిన పెన్షనర్ అంకాళ్ళ ప్రభుదాసును సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ ట్రెజరర్ రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు పోతులూరయ్య, పెన్షనర్లు సత్తెనపల్లి సైదులు, మల్లేశ్వరరావు, సూర్యనారాయణ, మోహిద్దీన్ జయనుల్లా, జగన్నాథనాయుడు, రవీంద్రనాథ్‌ఠాగూర్, వెంకట్రావు, నాగవర్ధన్, రమాదేవి, చంద్రయ్య, సుబ్బారావు, క్రీస్తు దాసు, జాన్ సుందర్‌సింగ్, కొండవీటి అంతయ్య, వాసు, చందు, ఖాదరవల్లి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేజర్ల సమస్యలు పరిష్కరించండి



నకరికల్లులో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

నకరికల్లు: మండలంలోని చేజర్లలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం సీనియర్ నేత ఈవూరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలంటూ ఇన్‌చార్జి ఎంపీడీఓ కె. సురేష్, ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నర్రా మమతలకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సాగర్‌కెనాల్ నుంచి బేతం రాజు చెరువు నింపేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేశారన్నారు. చెరువు నుంచి పైపులైన్‌లు ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామంలో దోమల వ్యాప్తి అరికట్టాలని, గిరిజన తండాలో సైడ్‌కాల్వలు లేక మురుగునీరంతా ఇళ్ల లోకి చేరుతుందని ఎస్సీ, ముస్లింకాలనీ, మూడు వేపచెట్ల సెంటర్లలో సత్వరమే సైడ్‌కాల్వలు నిర్మించాలని, ఊరవాగు సెంటర్ నుంచి ఎస్సీ కాలనీ, కబ్బయ్యస్వామి గుడి వరకు సీసీరోడ్లు నిర్మించాలని, రక్షిత మంచినీటి పైపులైన్‌లకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈవూరి అప్పిరెడ్డి, రామాంజినాయక్, కొండానాయక్, చట్టు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులను ప్రోత్సహించాలి

ఏపీ మేదరి సంఘం అధ్యక్షుడు మస్తాన్‌రావు



మాట్లాడుతున్న మేదరి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్‌రావు

సత్తెనపల్లి: మేదరి చేతివృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ మేదరి సంఘం అధ్యక్షుడు జొరిగె మస్తాన్‌రావు అన్నారు. మేదరి సంఘం సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యాన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ప్రపంచ వెదురు దినోత్సవం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతోమంది మేదరి కులవృత్తులు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. వెదురును సేకరించి వాటితో వివిధ ఆకృత్తుల్లో బుట్టలు, చాటలు, గంపలు, తడికలు, పలు రకాల పూజా సామగ్రి వస్తువులు చేస్తున్నారన్నారు. వాటిని మార్కెట్లో విక్రయించగా వచ్చే కొద్దిపాటి ఆదాయంతో జీవిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం మేదరిలను గుర్తించి, కులవృత్తులను ప్రోత్సహించి, ఆదుకోవాల్సిందిగా కోరుతున్నామన్నారు. ప్లాస్టిక్ వద్దు .. వెదురు ముద్దు అనే సంకల్పంతో మేదర్లంతా ఎన్నో సంవత్సరాలుగా బతుకు పోరాటం చేస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షలు పైన ఉన్న మేదరిలను ప్రభుత్వం గుర్తించి తమకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. పల్నాడు జిల్లా మేదర సంఘం అధ్యక్షుడు జొరిగె శ్రీనివాసరావు మాట్లాడుతూ వెదురు మీద ఆధారపడి జీవిస్తున్న మేదరిజాతిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం తమకు హ్యాండీక్రాఫ్ట్ సొసైటీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావు, మేదరిసంఘ పట్టణ నేతలు తుమ్మల శ్యామ్‌కుమార్, చందా ఆంజనేయులు, తుమ్మల శ్రీపతి, పిల్లి హనుమంతరావు, జొరిగె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు యూరియా పంపిణీ

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెంలో టీడీపీ నాయకుల మధ్య సయోధ్య కుదరడంతో యూరియా పంపిణీని శుక్రవారం పూర్తి చేశారు. ఒక వర్గం వారు ఎరువుల కట్టల కోసం టోకెన్లు పంపిణీ చేయటాన్ని మరో వర్గం అడ్డుకోవడంతో పంపిణీ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరువర్గాల వారు చెరో 50 టోకెన్లు పంచుకునేలా ఒప్పందం కుదరడంతో వివాదానికి తాత్కాలికంగా తెరపడింది. రెండు వర్గాలు వారి అనుయాయులు ఒక్కొక్కరికీ ఒక యూరియా, ఒక డీఏపీ కట్ట చొప్పున టోకెన్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద వ్యవసాయశాఖ అధికారుల సమక్షంలో 200 మందు కట్టలను పంపిణీ చేశారు.

రాజుపాలెం: యూరియాను తగు మోతాదులో వాడాలని క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ తెలిపారు. మండలకేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో రైతులకు శుక్రవారం యూరియాను పంపిణీ చేశారు. రాజుపాలెం, చౌటపాపాయపాలెం, బ్రాహ్మనపల్లి గ్రామాలకు చెందిన 220 మంది రైతులకు 240 యూరియా బస్తాలను అందించారు. గురువారం 220 మంది రైతులకు ముందుగానే టోకెన్‌లు అందజేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో వెంకటనర్సయ్య, తదితరులు ఉన్నారు.

సాంకేతిక నైపుణ్యం పెంపునకు కృషి



సత్తెనపల్లి పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్‌గుప్తా

సత్తెనపల్లి: విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం, సృజనాత్మకత, ఆవిష్కరణలు ప్రోత్సహించడానికి అటల్ టింకరింగ్ ల్యాబ్ దోహదపడుతుందని పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్‌గుప్తా అన్నారు. సత్తెనపల్లిలోని పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయంలో శుక్రవారం విద్యాలయ మేనేజ్మెంట్ కమిటీ సమావేశం (వీఎంసీ) నిర్వహించారు. తొలుత వీఎంసీ బాధ్యుడు, సత్తెనపల్లి తహసీల్దార్ కె.ఎస్. చక్రవర్తి అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో జగదీష్‌కుమార్‌గుప్తా మాట్లాడుతూ అటల్ టింకరింగ్ ల్యాబ్ ప్రారంభం చారిత్రాత్మక అడుగుగా నిలుస్తుందన్నారు. ఈ ఏడాది పాఠశాలలో అనేక ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దానిలో భాగంగా స్మార్ట్ క్లాస్ రూమ్ నిర్మాణం జరిగిందని, బోధన ప్రక్రియ పూర్తిగా సాంకేతిక ఆధారంగా జరుగు తుందన్నారు. విద్యాభ్యాసం మరింత ప్రభావం చూపుతుందని చెప్పారు.

చిల్డ్రన్ పార్క్ అభివృద్ధి చేపట్టామని పిల్లల సమగ్ర అభ్యున్నతికి ఆట స్థలం ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులకు అపారమైన జ్ఞానబండారం ఆన్‌లైన్ ద్వారా అందుబాటులోకి తీసుకురావడానికి డిజిటల్ లైబ్రరీ ఆరంభించామన్నారు. ఈ సందర్భంగా విద్యాలయం మేనేజ్మెంట్ కమిటీ సభ్యులతో ఆయా అంశాలపై చర్చించారు. సమావేశంలో విద్యాలయం మేనేజ్మెంట్ కమిటీ బాధ్యులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, సత్తెనపల్లి రైల్వేస్టేషన్ మాస్టర్ వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దారుణం

వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు అన్నపురెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

బెల్లంకొండ: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన మెడికల్ కళాశాలలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించడం దారుణమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అన్నపురెడ్డి నర్సిరెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఒక్క మెడికల్ కాలేజీనీ తీసుకొచ్చిన పాపాన పోలేదన్నారు. వైద్య విద్యార్థులపై చిత్తశుద్ధితో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చి, నిర్మాణాలను ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో ఉన్న మెడికల్ కాలేజీలను అమ్మడమే చంద్రబాబు సంపద సృష్టి అని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో 5 మెడికల్ కాలేజీలను పూర్తిచేసి, 750 మెడికల్ సీట్లు సృష్టించారన్నారు. వివిధ దశలలో ఉన్న మిగతా 12 కళాశాలలను పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వం 'కూటమి' అన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పాకలపాటి మౌలాలి, మండల మైనారిటీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు బడా బచ్చా, గడిపర్తి చినబాబు, గాదె నర్సిరెడ్డి, బద్దూరి మల్లారెడ్డి, బోదాటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అడుగడుగునా ఆంక్షలు



సత్తెనపల్లిలో చల్లంచర్ల సాంబశివరావును హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



అచ్యుత శివప్రసాద్‌ను హౌస్ అరెస్ట్ చేసి మాట్లాడుతున్న కానిస్టేబుల్

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు శుక్రవారం చలో ప్రభుత్వ మెడికల్ కళాశాల కార్యక్రమానికి నాయకులు వెళ్లకుండా ఉండేందుకు సత్తెనపల్లిలో పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. వైఎస్సార్ సీపీ నేతలను హౌస్ అరెస్టు చేశారు. నేతల ఇళ్ల వద్ద బందోబస్తు నిర్వహించారు.

–సత్తెనపల్లి

పత్తి సాగులో సస్యరక్షణ చర్యలు

సత్తెనపల్లి: ఇటీవల వర్షాలు కురిసిన నేపథ్యంలో పత్తి పంట సాగులో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని లామ్ ఫాం ప్రధాన శాస్త్రవేత్త ఎస్.రాజమణి అన్నారు. సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెంలో లామ్ ఫాం శాస్త్రవేత్తలు శుక్రవారం పత్తి పంట క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా రాజమణి మాట్లాడుతూ నీరు నిలుచున్న పంట పొలాల్లో అధిక నీరుని తీసివేసి, మొక్కలు చనిపోవడం గమనిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెన్డజిమ్ 1 గ్రాము లీటర్ నీటికి వేర్లు తడిసేలా పోసు కోవాలన్నారు. ఎకరాకు 20 కిలోల నత్రజని, 10 కిలోల పొటాష్ ఎరువు వేసుకోవాలన్నారు. 19:19:19 లేదా 13:0:45 ఎరువు 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పైపాటుగా పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లామ్ ఫాం ప్రధాన శాస్త్రవేత్తలు ఎస్. చాముండేశ్వరి, నాగజ్యోతి, రమేష్ చౌదరి, సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు, సత్తెనపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుబ్బారెడ్డి, గ్రామ వ్యవసాయసహాయకులు షేక్ నజీరా, రైతులు, పాల్గొన్నారు.

రాజుపాలెం: రెడ్డిగూడెంలలో పత్తి పంటను లాం ఫాం శాస్త్రవేత్తలు ఎస్ రాజమణి, ఎస్.చాముండేశ్వరి శుక్రవారం క్షేత్రప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తత రమేష్‌చౌదరి, క్రోసూరు సహాయ సంచాలకులు పి.మస్తానమ్మ, ఏవో పి.వెంకటనర్సయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర ప్రకటించండి

నార్నెపాడు(ముప్పాళ్ళ): కేంద్ర ప్రభుత్వం పత్తిపై ఉన్న దిగుమతి సుంకాన్ని రద్దు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని రైతు సంఘం నాయకులు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో పత్తి రైతులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం వినతి పత్రం అందించారు. సంఘ నేతలు తొండపి మస్తాన్‌రావు, నాయుడు నాగేశ్వరరావు, మలినేడి నాగేశ్వరరావు, కూరపాటి ప్రభాకర్, ఇందూరి పెద్దిరెడ్డి, దాసరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ధరణికోటలో తవ్వకాలకు నిధులు మంజూరుచేయండి



అమరావతి: శాతవాహనుల రాజధాని అయిన ధరణికోటలో కేంద్ర పురావస్తు శాఖకు చెందిన 16 ఎకరాల్లో తవ్వకాలు జరపడానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర పురావస్తు శాఖ తవ్వకాల విభాగం డైరెక్టర్ హేమసాగర్ ఏ నాయక్‌కు అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీ నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ ధరణి కోట దిబ్బల్లో తవ్వకాలు జరిపితే శాతవాహనుల, గౌతమ బుద్ధుడి కాలం నాటి అవశేషాలు, ప్రాచీన పురాతన నాణేలు, అమూల్యమైన పురాతన వస్తువులు వెలికితీసే ఆస్కారం ఉందన్నారు. గతంలో జరిపిన తవ్వకాల్లో విలువైన శిల్పాలు బయట పడ్డాయన్నారు. తవ్వకాకలు తగినంత నిధులను కేటాయించి భారత పురాతన చారిత్రక ఆస్తిని కాపాడాలన్నారు.

మేదర సంఘ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడిగా శ్యామ్‌కుమార్



సత్తెనపల్లి: మేదర సంఘం సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడిగా తుమ్మల శ్యామ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రపంచ వెదురు దినోత్సవ సందర్భంగా పట్టణంలోని మేదరి సంఘ రామాలయం వద్ద శుక్రవారం కార్యవర్గ సమావేశంలో ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా చందా సోమయ్య, ప్రధానకార్యదర్శిగా చందా ఆంజనేయులు, కోశాధికారిగా తుమ్మల శ్రీపతి, ఉపాధ్యక్షుడిగా జొరిగే వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా పిల్లి హనుమంతరావు, మరో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేదరి సంఘ సత్తెనపల్లిటౌన్ నూతన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షుడు జొరిగే మస్తాన్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కార్య వర్గాన్ని, రాష్ట్ర, జిల్లా బాధ్యులను మేదరి సంఘ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, యువకులు, మహిళలు, పాల్గొన్నారు.